# మంగమ్మగారు మూడో నెంబరు స్టాల్

"మొట్టమొదటిసారిగా నువ్వు మన ఇండిపెడెన్స్ డే కి అమెరికాలో వున్నావని కాబోలు అమ్మా ఈసారి మన ఫ్రీమాంట్ సిటిలో రెండు ప్రఖ్యాత తెలుగు సంస్థల వాళ్ళు కలిసి చాలా ఆర్భాటంగా మన స్వాతంత్ర్యోత్సవం జరుపబోతున్నారు." ఆఫీసు నుండి రాగానే ఉత్సాహంగా చెప్పింది బుజ్జి.



మామూలుగా అయితే సాయంత్రం ఇంటికి చేరేసరికి బాగా అలసిపోయి వుంటుంది బుజ్జి.

వాళ్ళు అపార్ట్‌మెంట్‌లో అద్దెకున్నప్పుడు ఫ్రీమాంట్‌లోనే ఉద్యోగం చేసేది. ఆఫీసుకూడా ఇంటికి దగ్గరే వుండేది. తీరా స్వంత ఇల్లు కొనుక్కుని అందులోకి మారేక శాన్‌ఫ్రాన్సిస్‌కోలో మంచి ఉద్యోగం దొరికింది. దూరమే అయినా అంతమంచి అవకాశాన్ని వదలుకోలేకపోయింది బుజ్జి.

పొద్దున్నే ఎనిమిదింటికల్లా బయల్దేరి కార్లో 'బార్ట్' దాకా వెళ్ళి, అక్కడ కారు వదిలేసి, రైల్లో నలభై అయిదు నిముషాలు ప్రయాణంచేసి శాన్‌ఫ్రాన్సిస్‌కోకు చేరుతుంది. అంటే రోజూ ఎంతలేదనుకున్నా రెండు గంటలు ప్రయాణంలోనే పోతుంది.

మామూలుగా అయితే సాయంత్రం ఆరింటికి ఇంటికి వచ్చేటప్పుడు ప్లేస్కూల్ నుండి కూతుర్ని తీసుకొస్తుంది. ఇప్పుడైతే అమ్మమ్మా, తాతయ్యా ఇంట్లో వున్నారు గనుక పాప తొందరగా వచ్చేస్తుంది. మంగపతిగారు బస్‌లో వెళ్ళి మనవరాల్ని తీసుకు వస్తారు. ఆయనకదో ముఖ్యమైన కాలక్షేపం.

"మరి ఇండిపెండెన్స్ డే వారం మధ్యలో వచ్చింది కదే! ఆఫీసులు, పనులు వదలిపెట్టి ఈ ఏర్పాట్లు అవీ ఎలా చేస్తారు?" అనుమానంగా అడిగారు మంగమ్మగారు.

"మామూలుగా పుట్టినరోజైనా, ఉగాది పండుగైనా వారం మధ్యలో వస్తే శనాదివారాల్లో జరుపుకున్నట్టే ఇదికూడ వారాంతం సెలవుల్లోనే అమ్మా... పైగా మనింటికి దగ్గరే... రెండ్రోజులూ ఇంచక్కా మీకు బోలెడు కాలక్షేపం!" అంది బుజ్జి.

మంగమ్మ గారికి ఉత్సాహంగా అనిపించింది.

ఆ శుక్రవారంనాడు బుజ్జి అలవాటుగా 'వర్క్ ఫ్రమ్ హోమ్" చేయడం వలన సాయంత్రం దగ్గరేవున్న గుడికి వెళ్ళారు.

కారు పార్క్‌చేసి, నెమ్మదిగా గుడివైపుగా నడుస్తున్న నలుగురూ ఆ పక్కనేవున్న హాల్లోంచి పెద్దగా "కజరారే..." అంటూ హిందీపాట వినబడుతుంటే కుతూహలంగా తొంగిచూశారు. రంగు రంగుల చుడీదార్లలో వున్న అమ్మాయిలు కొందరు చున్నీలను నడుముకు బిగించికట్టి ఆ సినిమా పాటకు అనుగుణంగా నృత్యం చేస్తున్నారు.

సరోజ్‌ఖాన్‌లా వున్నావిడ మధ్య మధ్యలో పాట ఆపేసి వాళ్ళు తప్పుగా వేసిన స్టెప్స్ వేసి చూపిస్తోంది.

"గుళ్ళో ఈ డాన్సులు పెడతారా ఏమిటి?" అంటూ బోలెడు ఆశ్చర్య పడ్డారు మంగమ్మగారు.

"కాదమ్మా! ఇండిపెండెన్స్ డే కోసం ప్రాక్టీసు చేస్తున్నారు." అంది బుజ్జి.

"ఇక్కడ పుట్టి పెరిగి, ఇక్కడి స్కూళ్ళలో చదువుతూ, తెలుగు మాట్లాడ్డం మర్చిపోయినా ఈ హిందీ సినిమా డాన్స్‌లు ఇంత కష్టపడి నేర్చుకుని వేస్తారన్నమాట ఈ ఇండియన్ అమెరికన్ కూనలు!" అంటూ బుగ్గలు నొక్కుకున్నదావిడ.

వాళ్ళు నాలుగు అడుగులు నడవకముందే ఇంకోపాట మొదలయింది. "మేరా పియా ఘర్ ఆయా ఓరామ్‌జీ.." అంటూ.

"అంటే ఈ డాన్సులన్నీ రేపు కార్యక్రమంలో వుంటాయన్నమాట.." అన్నదావిడ.

"ఇవే కాదు అత్తయ్యా! భాంగ్రా డాన్సులు, పంజాబీ 'భల్లే భల్లేలు', గుజరాతీల కోలాటాలు అన్నీ వుంటాయి." అన్నాడు మంగమ్మగారి అల్లుడు.

"రేపు పెరేడ్ వుంటుందమ్మా... మొత్తం ఇండియాను ఇక్కడే చూడొచ్చు. ఎల్లుండి సాంస్కృతిక ప్రదర్శనలు వుంటాయి. ఇక్కడ పోలీసు పర్మిషన్ తీసుకుని ట్రాఫిక్‌ని కూడా మరోవైపుకు మళ్ళించేస్తారు. అంత పెద్ద స్థలంచుట్టూ దడి కట్టేసి బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేస్తార్ట. ఇండియాలో అన్ని రాష్ట్రాలకు సంబంధించిన బట్టలూ, వస్తువులూ స్టాల్స్‌లో ఎగ్జిబిషన్‌లా పెడతారు. కావాలంటే కొనుక్కోవచ్చుకూడా." వివరించింది బుజ్జి.

అమెరికన్ ఇండిపెండెన్స్ డే జూలై నాలుగున అందరూ కార్లలో పార్కుల దగ్గరికి వెళ్తారు. కొంతమంది కార్లలో కూర్చునే 'ఫైర్ వర్క్' చూసి ఆనందిస్తే, మరికొంతమంది కార్లు పార్క్‌చేసేసి కుర్చీలు, దుప్పట్లు, కోకాకోలాలు, ప్రెట్జెర్లు (జంతికల లాటివి) మోసుకుని పార్కులో నచ్చిన చోట కూర్చుని చిరుతిండి తింటూ, కూల్‌డ్రింకులు తాగుతూ, కబుర్లు చెప్పుకుంటూ ఆకాశంలో దూసుకువెళ్ళి పూలవర్షంలా రకరకాల ఆకృతులలో అందాలు విరజిమ్మే తారాజువ్వల్లాటి ఫైర్‌వర్క్స్ చూసి ఆనందిస్తారు.

అమెరికా వచ్చి ఇండియన్ ఇండిపెండెన్స్ డే ఉత్సవాలు చూడబోతున్నానన్న ఆనందంతో ఆ రాత్రి మంగమ్మగారికి నిద్ర పట్టలేదు.

శనివారంనాడు పెరేడ్ జరిగే చోటికి కార్లో వెళ్ళి రోడ్డు పక్కన నిలబడి కనులపండుగగా అలంకరించిన బళ్ళ ఊరేగింపు చూశారు.

ఆదివారం సాయంత్రం మూడింటికే బయల్దేరి ఉత్సవం జరుగుతున్న ప్రాంగణానికి చేరుకున్నారు. విశాలమైన ఆవరణలో పెద్ద షామియానాలు వేసి, వేదికను, వేదికముందు కనీసం రెండువేల మంది కూర్చోడానికి వీలుగా కుర్చీలు వేశారు.

మంగమ్మగారు వాళ్ళు వెళ్ళేసరికి వాళ్ళ అదృష్టమో ఏమో గానీ "ముద్దుగారే యశోద ముంగిట మానిక్కెము వీడు... దిద్దరాని మహిమల దేవకీ సుతుడు" అన్న పాటకు చక్కని నృత్యాభినయాన్ని ప్రదర్శిస్తూంది పదేళ్ళ అమ్మాయి.

"అంతా హిందీ, పంజాబీ, గోలే వుంటుందనుకున్నాను. మన తెలుగు పాటలు, డాన్సులు కూడా పెడుతున్నారే" అంటూ సంబర పడిపోయారు మంగమ్మగారు.

"అమ్మా ఇక్కడ మా స్నేహితులు జోక్‌గా అంటుంటారు కాలిఫోర్నియాలో అఫీషియల్ లాంగ్వేజి తెలుగు అని.." అని నవ్వింది బుజ్జి.

"కాసేపు కూర్చుని సాంస్కృతిక ప్రదర్శన చూశాక "అలావెళ్ళి చుట్టూ తిరిగి వద్దాం పదండి నాన్నా" అంటూ వాళ్ళను బయల్దేరదీసింది బుజ్జి.

"మీ అమ్మను మాత్రం పొరబాటున కూడా చీరల షాపు దగ్గరికి మాత్రం తీసుకువెళ్ళకమ్మా. ఇక అక్కడే తెల్లారిపోతుంది." అంటూ కూతుర్ని హెచ్చరించాడు మంగపతిగారు.

"ఆ కొని కొని అమెరికాలో కొనాలి చీరలు. మీ కంటికి నేను మరీ అంత తెలివి తక్కువ దాన్లా కనిపిస్తున్నానులా వుంది." అలుకగా అని మూతితిప్పి పక్కకు తిరిగి నవ్వుకున్నారు మంగమ్మగారు.

"అవునవును. అన్నట్లు మీ అమ్మ ఈ మధ్యన మరీ జాగ్రత్త నేర్చుకుంది. లాభం లేనిదే ఏ పనీ చేయదు.!" సరదాగా అని నవ్వేశారు మంగపతిగారు.

"ఐ వాంట్ వాడర్ మమ్మీ" అంటూ బుజ్జి కూతురు మొదలు పెట్టింది, అమెరికన్ యాసలో.

"అయ్యో నీళ్ళసీసా కార్లోనే మర్చిపోయాం!" అంది బుజ్జి. "నేను వెళ్ళి కొనుక్కు వస్తాను" అన్నాడు బుజ్జి భర్త.

"అదిగో లోపలికి వస్తున్నప్పుడు అక్కడ నిలబడినవాళ్ళు నీళ్ళ సీసాలు అందరికీ ఇస్తుంటే నేనూ తీసుకున్నా ఫ్రీగా ఇస్తున్నారుకదా అని." అంటూ రెండు సీసాలు చూపించారు మంగమ్మగారు.

"ఊరికే ఇచ్చారా?" అంటూ ఆశ్చర్యంగా సీసాలను తిప్పి చూసింది బుజ్జి. సీసాల మీద బైబిలు వాక్యాలు కనిపించాయి.

"అదీ సంగతి.. ఇది మనవాళ్ళ దానగుణమే" అంటూ కూతురికి సీసా అందించింది బుజ్జి.

అలా చుట్టూ చూసుకుంటూ నడుస్తున్నారు నలుగురూ. ఎంత వద్దనుకున్నా ఆడవాళ్ళ కాళ్ళు, బట్టలు, గాజులు అమ్ముతున్న స్టాల్స్‌వైపే నడిచాయి.

అక్కడ చాలా మామూలుగా వున్న చుడీదార్లు, చీరలు ఖరీదులు చూసి గుండె బాదుకున్నారు మంగమ్మగారు.

"నాలుగువందలుచేసే చుడీదార్లు నాలుగువేలు పోసి ఎవరు కొంటారే? సుబ్బరంగా మనమూ ఇండియా నుండి చీరెలూ, పంజాబీ డ్రెస్‌లూ తెచ్చి ఇక్కడో స్టాల్ పెట్టినా బోలెడు లాభం వచ్చేది" అన్నదావిడ మంచి అవకాశం పోగొట్టుకున్నామన్న బాధను వ్యక్తం చేస్తూ.

"అలా అనుకుంటే మనం పచారీ సామాను షాపు పెట్టినా, బజ్జీల బంకు పెట్టినా డాలర్ల వర్షమే." నవ్వుతూ అన్నాడు బుజ్జి భర్త.

ఒక్క ఫ్రీమాంట్ సిటీ నుండే కాకుండా చుట్టుప్రక్కల వున్న శాంటక్లారా, సాన్‌హూసె, మిల్పిట్రాస్ మొదలైన పట్టణాల నుండి ఇండియన్ హొటల్స్ వాళ్ళు అక్కడ దుకాణాలు తెరిచేశారు.

సమోసాలు, మిర్చి బజ్జీలు, పావ్‌బాజీలు ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి.

"ఐ వాంట్ దోసె" అంది చిన్నది.

అందరూ 'స్వాగత్' హొటల్‌లో వెళ్ళి కూర్చుని కావల్సినవి తిని బయటపడ్డారు.

వీళ్ళు ఒకసారి చుట్టూ తిరిగి వచ్చేసరికి సరోజ్‌ఖాన్ లాటి అమెరికన్ ఇండియన్ 'ఖజరారే..." పాట గురించి చెప్తోంది. భుక్తాయాసం తీర్చుకోడానికి కాసేపు కూర్చుని ఆ డాన్సులు చూశారు.

"ఒకవైపు అమెరికన్ వేష భాషలు అలవాటు పడుతూనే మరోవైపు ఈ పాటలూ... డాన్సులూ... బాగానే వుంది." అన్నారు మంగమ్మగారు.

"అమ్మా! మన వాళ్ళు జనవరి ఫస్ట్‌కి క్లబ్‌లకు పబ్‌లకు తిరగడం లేదా? అలాగని మన పండగలు వదిలేస్తున్నారా? ఇక్కడి ఇండియన్స్‌కి తమ సంస్కృతి, సంప్రదాయాలను వదలకూడదన్న తపన ఎక్కువ. ఇక్కడ గుళ్ళో

ఉగాది ఎంతబాగా చేస్తారో తెలుసా? దేవదాసు సినిమాను ఇక్కడ వేలం వెర్రిగా చూశారు." అంది బుజ్జి.

"ఇండియా పాకిస్తాన్‌ల మధ్యన క్రికెట్ మ్యాచ్ వుంటే స్నేహితులంతా గుంపులుగా కూర్చుని టి.వి. చూస్తూ అరుపులు, కేకలతో కేరింతలు కొడతారు. దురదృష్టవశాత్తూ ఇండియా ఓడిపోతే మర్నాడు అన్నం నీళ్ళు మానేసే వాళ్ళున్నారు. మా స్నేహితులలో..." అన్నాడు బుజ్జి భర్త.

"పోయినసారి నువ్వే ఆ పని చేసినట్టున్నావు!" నవ్వుతూ అల్లుడి భుజం తట్టారు మంగపతిగారు.

"ఇవిగో నేను వెళ్ళి ఇంకో రెండు సీసాల నీళ్ళు తీసుకువచ్చాను. వాళ్ళు ఫ్రీగా ఇస్తుంటే మనం డబ్బులుపోసి కొనుక్కోవడం ఎందుకూ దండగ?" అంటూ మరో రెండు సీసాలు బయలు తీశారు మంగమ్మగారు.

"అన్నట్టు నీళ్ళకోసం వెళ్ళినప్పుడు చూశాను. ఎంట్రెన్స్‌కి దగ్గరే మూడో నంబరు స్టాల్ దగ్గర బోల్డు జనం. క్యూలో వున్నారు. ఏవో ఫ్రీ గిఫ్ట్‌లు ఇస్తున్నార్ట. పదండి మనం వెడదాం" అంటూ అందర్నీ హడావుడి పెట్టేసిందావిడ.

వీళ్ళు వెళ్ళేసరికి మూడో నంబరు స్టాల్ దగ్గర సుమారు పాతిక మందిదాకా 'క్యూ'లో నిలబడి వున్నారు.

కాసేపు నిలబడ్డాక "పోమ్మా... వీళ్ళిచ్చే గిఫ్ట్‌కోసం ఎవడు నిలబడతారు?" అంటూ బుజ్జి, ఆమె మొగుడూ పిల్లతో సహా వెళ్ళి షామియానాలో కూర్చున్నారు.

తానూ కదలబోతున్న మంగపతిగారిని ఆపేశారు మంగమ్మగారు "వాళ్ళయితే పిల్లలు. ఏదీ లెక్కచేయరు. కాసేపు నిలబడితే పోయింది. వీళ్ళు ఏం బహుమతి ఇస్తారో ఏమో... ఎంతైనా తెల్లవాళ్ళుకదా... మంచివే వుంటాయి. నిజంగా బాగుంటే ఇండియా వెళ్ళాక తెల్సినవాళ్ళకి ఇస్తే సంతోషపడతారు" అంటూ.

ఇక చేసేది లేక ఆయన కాళ్ళు పీకుతున్నా అలా నిలబడిపోయారు. తన వంతు వచ్చేసరికి మంగమ్మగారు ఇనుమడించిన ఆనందంతో ముందుకు వెళ్ళారు.

అక్కడేదో చక్రం లాటిది పెట్టారు. బలంగా ఆ చక్రాన్ని తిప్పి వదలమన్నారు. అది ఏ అంకె దగ్గర ఆగితే దానికి సంబంధించిన ప్యాకెట్ అందించారు. దాంతోబాటు కంపెనీ ప్రకటన 'కాగితంకూడా!'

మంగమ్మగారికి పింక్ ప్యాకెట్, మంగపతిగారికి బ్లూ ప్యాకెట్ వచ్చాయి.

పిల్లల దగ్గరికి వెళ్ళేదాకా ఆగలేక క్యూ నుండి బయట పడగానే రెండు కవర్లూ ఆత్రంగా చింపి చూశారు మంగమ్మగారు.

ఒకదాన్లో సన్నని స్టెయిన్ లెస్ స్టీల్ దండ, ఇంకొక దానిలో ప్లాస్టిక్ 'కీ' చెయిన్ వున్నాయి.

వాటిని చూసి మంగమ్మగారి ముఖం వెల వెలపోయింది.

చిన్నబుచ్చుకున్న ముఖంతో వచ్చి కూర్చున్న తల్లిని చూసి బుజ్జి నవ్వుతూ అడిగింది "ఏం గిఫ్ట్ సంపాదించేవమ్మా?" అని.

"అమెరికా నుండి తెచ్చినవని ఎవరికన్నా ఇవ్వడానికి పనికి వస్తాయనుకుని గంటసేపు 'క్యూ'లో నిలబడ్డాను అనవసరంగా. కుక్క గొలుసుగా కాదుకదా పిల్లి మెడకు కట్టడానికికూడా పనికిరానివి ఇచ్చారు" అంటూ కూతురికి చూపించిందావిడ.

"ఫ్రీగా వస్తే ఫినాయిల్ తాగుతామంటారు అని మన వాళ్ళని కొందర్ని వెక్కిరిస్తాం అత్తయ్యా. ఇక్కడ మనుషులూ అంతే... ఫ్రీ బీసంటే వీళ్ళకూ మోజే. చూశారుగా తెల్లవాళ్ళూ వున్నారు 'క్యూ'లో. వీళ్ళ 'లేబర్ డే'కో, క్రిస్మస్‌కో తగ్గింపు ధరలనివేస్తే తెల్లవారు ఝామునే లేచి 'క్యూ'లో నిలబడతారు." ఓదార్పుగా అన్నాడు మంగమ్మగారి అల్లుడు.

"చెప్పానుకదమ్మా! మీ అమ్మ లాభసాటి పనులే చేస్తుంది. కానీ ఒక్కోసారి బెడిసి కొడతాయి. అంతే" నవ్వారు మంగపతిగారు.